సాగుబడి



నాగలితో పొలం దున్నుతున్న రైతు(ఫైల్)

- నేటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'
- ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో..
- వానకాలం సాగు, దిగుబడులపై అవగాహన

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు సాగులో సలహాలు, సూచనలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'రైతు ముంగిట్లో' శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం నాగర్‌కర్నూల్ జిల్లాలో సోమవారం ప్రారంభం కాగా, నారాయణపేట, వనపర్తి జిల్లాలో మంగళవారం, మహబూబ్‌నగర్, గద్వాలలో ఈ నెల 8న శ్రీకారం చుట్టనున్నారు. ఆయా జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లోకి శాస్త్రవేత్తలు వెళ్లి, విత్తనాల ఎంపిక, రసాయన ఎరువుల వాడకం తగ్గింపు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు అవగాహన కల్పించనున్నారు.

నారాయణపేట/వనపర్తి రాజీవ్ చౌరస్తా, మే 5 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఇటీవల పంట నష్టం తీవ్రంగా పెరిగిపోతోంది. మరో నెల రోజుల్లో వానకాలం సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో సోమవారం ఈ కార్యక్రమం ప్రారంభం కాగా, మిగతా జిల్లాల్లో నిర్వహించాల్సి ఉంది. వనపర్తి జిల్లాలో మంగళవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు 12 రోజుల పాటు, నారాయణపేట జిల్లాలో నేటి నుంచి జూన్ 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. శాస్త్రవేత్తలు నేరుగా రైతుల వద్దకు వెళ్లి నూతన వ్యవసాయ విధానాలు, ఎరువులు, పురుగు మందుల వినియోగం, సాగు ఖర్చుల తగ్గింపు వంటి కీలక అంశాలపై సలహాలు, సూచనలు అందించనున్నారు. జిల్లాలో ఎంపిక చేసుకున్న ప్రాంతాలకు అనుగుణంగా సమీపంలో ఉన్న రైతు వేదికలలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 71 రైతు వేదికలు ఉండగా 12 రైతు వేదికలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గత వానకాలంలో జిల్లాలో 2,41,618 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగు చేశారు. ఈ సీజన్‌లో కూడా సుమారు అదే స్థాయిలో సాగు జరిగే

(మిగతా 6లో..)



ఎండ ప్రచండం

- వనపర్తి జిల్లాలో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

వనపర్తి/నారాయణపేట/గద్వాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుకున్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట, కొత్తకోటలో పెబ్బేరు లలో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మదనాపూర్‌లో 42.3, పాన్‌గల్‌లో 42.1, పెద్దమందడిలో 41.9, చిన్నంబావి, అమరచింత, శ్రీరంగాపూర్ లలో 41.5, ఆత్మకూరులో 41.3, ఘణపూర్‌లో 41.0, వీపనగండ్లలో 40.8, రేవల్లి, వనపర్తి లలో 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా వనపర్తిలో 24.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో 42 డిగ్రీలు, మల్దకల్‌లో 41.9, గట్టులో 41.8, గద్వాల, ఇటిక్యాలలో 41.6, కేటీదొడ్డిలో 41.5, అయిజలో 41.5, వడ్డేపల్లిలో 41.1, ధరూర్‌లో 41.1, ఉండవెల్లిలో 40.8, మానవపాడులో 37.3 డిగ్రీలుగా నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతల 26.9 డిగ్రీలు నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 39 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 38 డిగ్రీలు, కనిష్ఠం 25 డిగ్రీలుగా నమోదైంది.

జడ్చర్ల బైపాస్ రోడ్డు నిర్మించాలి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి ప్రతం ఇస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ డీకే అరుణతో కలిసి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వినతి
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

జడ్చర్ల, మే 5(ఆంధ్రజ్యోతి): సమగ్రాభివృద్ధిలో భాగంగా జడ్చర్ల బైపాస్ రోడ్డును నిర్మించాలనే వినతిపై కేంద్ర రోడ్డు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. సోమవారం తెలంగాణ పర్యటనకు వచ్చిన గడ్కరీని కన్హాశాంతివనం వద్ద జడ్చర్ల బైపాస్ రోడ్డు విషయంపై మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు అనిరుధ్‌రెడ్డి మీడియాకు తెలిపారు. జడ్చర్ల-హైదరాబాద్ జాతీయ రహదారి 44ను.. జడ్చర్ల-కల్వకుర్తి జాతీయ రహదారి 167తో అనుసంధానం చేస్తూ ఈ బైపాస్ రోడ్డు నిర్మించాలని కేంద్ర మంత్రిని కోరామని చెప్పారు. దినదినాభివృద్ధి చెందుతున్న జడ్చర్ల అరబిందో ఫార్మా, పెట్రోకెమికల్స్, హెటిరో, హిందూస్థాన్, అన్‌లీవర్ వంటి సుప్రసిద్ధమైన పరిశ్రమలకు నెలవుగా ఉందన్నారు. నర్సీ మాంజీ యూనివర్సిటీ, స్వామి నారాయణ్ గురుకుల్, ఉడ్ ల్యాండ్ ఇంటర్నేషనల్ స్కూల్, శ్లోకా ఇంటర్నేషనల్ స్కూల్ వంటి విద్యాసంస్థలతో ఎడ్యుకేషనల్ హబ్‌గా ఉందని గడ్కరీకి వివరించారు. దీంతో పాటు అలంపూర్ జోగుళాంబ శక్తిపీఠం, మంత్రాలయం, గంగపురం లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయాలకు వెళ్లడానికి ప్రధాన రోడ్డు ఇదని తెలిపారు. 44, 167 జాతీయ రహదారులతో పాటు వనపర్తి-జడ్చర్ల వెళ్లే 23వ నంబర్ స్టేట్ హైవే రోడ్డు, రైల్వే డబుల్ లైన్ కూడా ఉందని వివరించారు. దాంతో జడ్చర్ల పట్టణంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటోందన్నారు. ఈ రద్దీని నివారించడానికి నేషనల్ హైవే 44, నేషనల్ హైవే 167ను అనుసంధానిస్తూ 4 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరారు. ఇది జడ్చర్ల ప్రాంత అభివృద్ధిలో మరో కలికితురాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ విషయంపై గడ్కరీ సానుకూలంగ స్పందించారని, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు.

లేగదూడపై హైనా దాడి

- మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం యన్మనగండ్లలో ఘటన

6

అంగన్‌వాడీ టీచర్లకు.. సెలవులు లేనట్లేనా?

- ప్రభుత్వం ప్రకటించినా, అందని ఉత్తర్వులు
- విధులు నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాలు

7

వేర్వేరు ప్రాంతాల్లో ట్రాక్టర్ల కిందపడి ఇద్దరు బాలుర మృతి

- వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో ఒకరు, అమరచింత మండలంలో మరొకరు..

7

నీళ్లు కావు.. ఎండమావులు

క్లిక్.. క్లిక్..

వనపర్తి జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఒక్కోసారి 40 డిగ్రీలు దాటుతోంది. నేల ఉపరితలం ఎక్కువగా వేడెక్కినప్పుడు దానికి సమీపంలోని గాలి వేడెక్కుతుంది. పైన ఉన్న గాలి చల్లగా ఉంటుంది. ఈ ఉష్ణోగ్రత వ్యత్యాసం వల్ల గాలి సాంద్రతలో తేడా ఏర్పడుతుంది. వేరు వేరు సాంద్రతలు కలిగిన గాలి ద్వారా కాంతి ప్రయాణించడంతో అది వక్రీభవనం చెంది, నీటి గుండంలా కనిపిస్తుంది. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రం నుంచి ఘణపురం తండాకు వెళ్లే రోడ్డుపై ఆ దృశ్యం సోమవారం కనిపించింది. 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

\- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి





రోడ్డుపై కనిపిస్తున్న ఎండమావులు

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి

- కలెక్టర్ విజయేందిర బోయి
- మూసాపేట మండలంలో రెవెన్యూ అవగాహన సదస్సులు



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మూసాపేట, మే 5(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందని కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. భూ భారతిలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మూసాపేట మండలంలోని చక్రాపూర్, తుంకినీపూర్ సోమవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడారు. రైతులు తమ భూముల సమస్యల పరిష్కారానికి దరకాస్తు చేసుకోవాలని చెప్పారు. అధికారులు రికార్డులను పరిశీలించి, పరిష్కరిస్తారని అన్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో భూ రికార్డుల్లోని పేర్ల తప్పులు, విస్తీర్ణం హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు, భూస్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టాపాసు పుస్తకాలు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బీలో చేర్చిన భూములు, భూసేకరణ తదితర సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. భూ భారతి చట్టం ప్రకారం అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, నిర్దేశిత గడువులో పరిష్కరిస్తారని తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం పరిశీలన..

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చక్రపూర్‌లో చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని కలెక్టర్ విజయేందిరబోయి పరిశీలించారు. సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ కలెక్టర్‌కు వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ప్రతీ రైతుకు 14 అంకెల విశిష్ట సంఖ్య కేటాయిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీవో నవీన్, తహసీల్దార్ రాజు, డీటీ శ్రీనివాసులు, ఏవో అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

పేట- కొడంగల్ భూసేకరణపై సమీక్ష

- గడువులోగా పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): భూసేకరణ, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి, నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ పనులను గడువులోగా పూర్తి చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పథకం పెండింగ్ భూసేకరణ పనులపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు. ప్యాకేజీ-1, 2 కింద పంప్‌హౌస్, పైపులైన్ల ఏర్పాటు కోసం భూసేకరణ పూర్తయ్యిందన్నారు. ప్యాకేజీ-1లో భాగంగా చెరువుల కింద భూసేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. ప్రధానంగా పేరపళ్ల జయమ్మ చెరువు పరిధిలో 219 ఎకరాలను సేకరించాల్సి ఉందని ఇరిగేషన్ ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. అయితే ఏయే సర్వే నంబర్లలో ఎన్ని ఎకరాలను సేకరించాలనే విషయమై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఊట్కూరు చెరువు కింద ఊట్కూర్‌తో పాటు పలు గ్రామాల పరిధిలో 311 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. సమీక్షలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఆర్డీవో రాంచందర్‌నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీధర్, ఈఈలు పాల్గొన్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

- కాంట చెడిపోయిందన్న నిర్వాహకులు
- యానగుంది - కొడంగల్ అంతర్రాష్ట్ర రహదారిపై రైతుల రాస్తారోకో

6



రాస్తారోకో చేస్తున్న రైతులు

మిల్లుల ముందు పడిగాపులు

- 'పేట' జిల్లా కృష్ణ మండలం వసుధ రైస్ మిల్లు వద్ద నిలిచిన 200 వాహనాలు
- ధాన్యం అన్‌లోడింగ్‌లో తీవ్ర జాప్యం

6

ధాన్యం బస్తాలతో రోడ్డుపై బారులు తీరిన వాహనాలు



వేసవి శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలి

- రోజూ 100 మంది విద్యార్థులు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదే
- 'పేట' కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలో నిర్వహిస్తున్న 50 వేసవి శిబిరాల నిర్వహణ గురించి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 15 రోజుల పాటు కొనసాగే శిక్షణలో రోజు వారి అంశాలను ప్రాధాన్య క్రమంలో నిర్వహించాలన్నారు. ప్రతీ కేంద్రానికి నలుగురు వలంటీర్లను తప్పనిసరిగా నియమించుకోవాలన్నారు. 100 మంది విద్యార్థులు రోజూ హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదే అన్నారు. రోజూ ప్రధానోపాధ్యాయుడితో పాటు సీనియర్ ఉపాధ్యాయులు క్యాంపును సందర్శించి ఆంగ్లం, గణితం, సైన్స్ ఎక్స్‌పెరిమెంట్లను నిర్వహించేందుకు తగు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. అవసరమైన సందర్భంలో స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవచ్చన్నారు. కేజీబీవీలో రెసిడెన్షియల్ సమ్మర్ క్యాంపును మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో మునిసిపల్ కమిషనర్ బోగేశ్వర్లు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ విద్యాసాగర్, జీసీడీవో నర్మద పాల్గొన్నారు.

ఇడ్లీలో జెర్రీ...

- అవాక్కైన వినియోగదారుడు
- ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఉడిపి హోటల్‌లో సంఘటన


ఇడ్లీలో బయటపడ్డ జెర్రీ

వనపర్తి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుళ్ల వెలుస్తున్న హోటళ్లపై అధికారుల పర్యవేక్షణ ఏ పాటిదో ఈ సంఘటన వింటే తెలుస్తుంది. వనపర్తి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఒక ఉడిపి హోటల్‌లో ఇడ్లీలో ఏకంగా జెర్రీ కనిపించడం కలకలం రేపింది. వినియోగదారుడు, చుట్టుపక్కల ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం... మంగనూరు గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి, విజయరెడ్డి, రిషితరెడ్డి, పూజితరెడ్డి కుటుంబ సమేతంగా శ్రీరంగపురం మండలంలోని కంబళాపురం గ్రామంలో శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణంలో సోమవారం ఉదయం టిఫిన్ చేయడానికి ఉడిపి హోటల్‌కు వెళ్లారు. ఇడ్లీ తినడానికి ఆర్డర్ ఇచ్చారు. తిందామని ఇడ్లీని చూసే సరికి అందులో జెర్రీ కనిపించడంతో ఒక్కసారిగా అవాక్కై కంగారు పడ్డారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటూ.. శుభ్రత, సుచిని పాటించకుండా ఎలా నిర్వహణ చేస్తున్నారని యజమానితో వాదనకు దిగారు. ఇలాంటి హోటళ్లపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని వినియోదగారులు మొరపెట్టుకున్నారు.

హోటల్ యజమాని వివరణ.

ఈ విషయమై హోటల్ యజమాని అశోక్‌ని వివరణ కోరగా...సంఘటన జరిగిన ప్పుడు నేను హోటల్‌లో లేను. కూరగాయలు తీసుకురావడానికై బయటికి వెళ్లాను. సమస్య తెలిసిన వెంటనే హోటల్‌కు వచ్చి కస్టమర్లను సముదా యించాను. ఇడ్లీ పిండిలోనే చనిపోయన జెర్రీ వచ్చినట్లుంది. వండిన ఇడ్లీ లతో పాటు మరికొన్ని ఆహార పదార్థాలను పారబోయించాను. పాత్రలను కూడా శుభ్రంగా కడిగించాను. గత ముప్పై ఏళ్లుగా హోటల్‌ను నిర్వ హిస్తు న్నాను. ఎప్పుడు ఇలా జరగలేదు.

మహిళ అదృశ్యం

నవాబ్‌పేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మహ బూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలో ని పోమాల గ్రామానికి చెందిన కొప్పునోళ్ల యాదమ్మ అదృశ్యం అయ్యిందని ఎస్‌ఐ విక్రం తెలిపారు. ఈనెల మూడున ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. చు ట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదని తెలిపారు. ఈ విషయంపై ఆమె తమ్ముడు నర్సింహులు సోమవారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐదుగురు సెల్‌ఫోన్ దొంగల రిమాండ్

బిజినేపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లను దొంగతనం చేసిన ఐదుగురు నిందితులను పట్టుకొని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో సోమవారం ఎస్‌ఐ నిందితులను రిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. కొంతకాలంగా వివిధ ప్రాంతాల్లో బస్టాండ్ ఆవరణలో, సంతల్లో సెల్‌ఫోన్‌లను దొంగిలించిన నిందితులను సీసీ కెమెరా ఫుటేజ్‌ల ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. విచారణలో నిందితుల నుంచి 17 సెల్‌ఫోన్‌లు, ఒక షిఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నిందితులు వనపర్తి జిల్లా కొత్తకోట గ్రామా నికి చెందిన ఆకుల సాయికృష్ణ, రంగారెడ్డి జిల్లా తిరుమలహిల్స్‌కు చెందిన పసుపులేటి అలియాస్ సతపతి కిరణ్ అలియాస్ హర్షవర్ధన్, ఒడిస్సాకు చెందిన కిరణ్ దాసు, దాసు వంశీ, అవుల రోహన్ అనే వ్యక్తులను రిమాండ్ చేశారు. దొంగతనాలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు షాపుల వద్ద, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కోస్గి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. నారాయణపేట జిల్లా, కోస్గి మండల పరిధిలో ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నాచారం గ్రామానికి చెందిన రెడ్డిపల్లి లక్ష్మి (56), మెత్కు శ్రీనివాస్‌లు ద్విచక్రవాహనంపై కోస్గికి బయలుదేరారు. బస్ డిపో సమీపంలో రోడ్డు పక్కనున్న చెత్తకుప్ప వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో రెడ్డిపల్లి లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. మెత్కు శ్రీనివాస్ ఆమెను కోస్గి ఆసుపత్రికి తరలించాడు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు చంద్రకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపాడు.

రెండు బైకులను ఢీకొట్టిన బొలెరో

- ముగ్గురికి గాయాలు

ఉప్పునుంతల, మే 5 (ఆంధ్రజ్యోతి) రెండు బైకులను ఢీకొట్టిన బొలెరో వాహనం ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం రాత్రి ఉప్పునుంతల సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఉప్పునుంతలకు చెందిన హరిష్, స్వామి, జంగయ్య ముగ్గురు రెండు బైకులపై అచ్చంపేటకు వెళ్లి ఉప్పునుంతలకు తిరుగు ప్రయాణంలో ఉప్పునుంతల వైపు వస్తున్న బొలెరో వాహనం అతి వేగంగా వస్తూ ఢీకొన్నది. బైకులపై వెళుతున్న ముగ్గురికి కాళ్లకు చేతులకు గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. వీరిని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

లేగదూడపై హైనా దాడి

నవాబ్‌పేట, మే 5(ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్లలో లేగదూడపై హైనా దాడి చేసి చంపేసిం ది. రైతు బ్యాగరి శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి తమ పొలంలోని పాకలో పశువులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. సో మవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా లేగదూడ చనిపోయి కనిపిం చింది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని శ్రీనివాసులు కో రారు. నెల రోజులుగా తమ ప్రాంతంలో చిరుతలు, హైనాలు సంచరిస్తు న్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అడవి జంతువు దాడిలో..

మహమ్మదాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మాపూర్ గ్రామ శివారులో ఉన్న కావలి లాలయ్య పొలం వద్ద లేగదూడపై ఆదివారం రాత్రి అడవి జంతువు దాడి చేసి గాయపరిచింది. బాధితుడి కథనం ప్రకారం ధర్మాపూర్ గ్రామ శివారులోని పొలం దగ్గర పశువుల పాకలో ఆవులు, లేగదూడలు, బర్రెలు కట్టేశాడు. 11.30 ప్రాంతంలో అటవీ జంతువు దాడి చేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి బెదిరించారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా లేగదూడపై దాడి చేసింది చిరుతనేనని అనుమానం వక్తం చేశారు.

రేపు సాఫ్ట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌బాల్ ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపికలను బుధవారం నిర్వహించనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు రాఘవేందర్, నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సంబంధిత పత్రాలతో స్టేడియంలో రిపోర్టు చేయాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల మూడో వారంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలుర టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.


అంతర్రాష్ట్ర రహదారిపై నిలిచిన 100కు పైన ధాన్యం ట్రాక్టర్లు


దారి పొడవునా ధాన్యం ట్రాక్టర్లు


ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

- కాన్‌కుర్తి మిల్లు వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు
- కాంట చెడిపోయిందని చేతులెత్తేసిన నిర్వాహకులు
- అంతర్రాష్ట్ర రహదారిపై రైతుల రాస్తారోకో
- అధికారుల హామీతో విరమణ


పోన్నకల్‌లో ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

దామరగిద్ద, మే 5 (ఆంధ్రజ్యోతి) : దొడ్డు ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. నారాయణపేట జిల్లాలోని యానగుంది - కొడంగల్ అంతర్రాష్ట్ర రహదారిపై సోమవారం రాస్తారోకో చేశారు. దామరగిద్ద మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం 100 ట్రాక్టర్లకు పైగా దొడ్డు ధాన్యం లోడ్‌తో కాన్‌కుర్తి శివారులోని రైస్ మిల్లుకు చేరుకున్నారు. మిల్లు వద్ద ధర్మకాంటా లేదు. దీంతో రైతులు అక్కడికి సమీపంలోని పత్తిమిల్లు వద్దకు వెళ్లారు. అక్కడి ధర్మకాంటా కూడా పని చేయక పోవడంతో ధాన్యం ట్రాక్టర్లను క్యాతన్‌పల్లి రైసు మిల్లు వద్దనున్న ధర్మకాంటాకు తీసుకెళ్లారు. కొందరు రైతులు కర్ణాటకలోని గుర్మిట్కల్‌కు వెళ్లి తూకం చేసుకొని మళ్లీ కానుకుర్తి రైసు మిల్లు వద్దకు చేరుకున్నారు. అక్కడ ట్రాక్టర్లపై ఉన్న ధాన్యాన్ని దించుకోకపోవడంతో రైతులు రాత్రంతా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఖాళీ అయిన తరువాత ఖాళీ ట్రాక్టర్‌ను తూకం చేసేందుకు మళ్లీ గుర్మిట్కాల్ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తీరా సోమవారం కూడా కాంటాలు పని చేయడం లేదని నిర్వహకులు ధాన్యం కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పి ఆందోళన విరమింపచేశారు. అనంతరం సమీపంలోని పత్తిమిల్లు, రైసు మిల్లుల వద్ద ధర్మకాంటాలను పరిశీలించారు. అవి పని చేయడం లేదని యజమానులు తెలిపారు. దీంతో సాయంత్రం ఆరు గంటల వరకు వాటిని మరమ్మతు చేయిస్తామని అధికారులు రైతులకు తెలిపారు. కానీ ఫలితం లేకపోయింది. ఈ సందర్భంగా డీఎస్‌వో బాల్‌రాజు మాట్లాడుతూ ధర్మకంటాలు పని చేయడం లేదని తెలిపారు. ఒక కాంటా బాగు చేయించి ట్రాక్టర్లు ఖాళీ చేయిస్తామని తెలిపారు. రైతుల ఆందోళనకు సీపీఎం నాయకులు గోపాల్, అంజిలయ్య గౌడ్, మహేష్‌గౌడ్ మద్దతు తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

వీపనగండ్ల (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంట ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి ధాన్యం కొనుగోలు నిలిపివేయడం దారుణమన్నారు. తాలు, తరుగు పేరుతో మిల్లర్లు కోత విధిస్తున్నారని ఐకేపీ వారు కొనుగోలు నిలిపి వేశారన్నారు. క్వింటాలుకు రెండు కిలోలు అదనంగా తూకం వేసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు పలుస లక్ష్మణ్‌గౌడ్, ఉమా మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జగన్‌రెడ్డి, నారాయణ, జక్కుల కురుమయ్య, చిన్నస్వామి, లోకారెడ్డి, విష్ణు, వెంకటరెడ్డి, స్వామిరెడ్డి తదితరులు డిమాండ్ చేశారు.

ఇతర జిల్లాలకు దొడ్డు ధాన్యం

మద్దూర్ (ఆంధ్రజ్యోతి) : దొడ్డు ధాన్యాన్ని ఇతర జిల్లాలకు తరలించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. దొడ్డు ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకునేందుకు మిల్లర్లు నిరాకరించడంతో ఈనెల 3న రైతులు ఆందోళన చేపట్టారు. దీంతో అధికారులు స్పందించి 20 ట్రాక్టర్ల ధాన్యాన్ని పద్మావతి రైస్‌మిల్లుకు తరలించారు. మిగిలిన ధాన్యం రెండు రోజులుగా అక్కడే ఉండిపోయింది. విషయం తెలుసుకున్న సివిల్ సప్లై డీఎం సైదులు, డీటీ ఆనంద్ సోమవారం మద్దూర్‌కు చేరుకున్నారు. గద్వాల, రంగారెడ్డి జిల్లాలోని రైస్ మిల్లులకు దొడ్డు ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టారు. రైతులు ధాన్యాన్ని మిల్లులకు తేవొద్దని, కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు.

ధాన్యం తరలించాలి


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శేఖర్, ఎస్సై శ్రీనివాస్

మూసాపేట (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించాలని వనపర్తి సోమవారం జిల్లా, అడ్డాకుల మండలంలోని పొన్నకల్‌లో రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల నుంచి లారీలు రా కపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని తెలిపారు. రాస్తారోకోతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శేఖర్, ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. లారీలు వస్తాయని, రాక పోతే ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తామని భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు దోనూరు విజయకుమార్‌రెడ్డి, కావలికృష్ణయ్య, నరేందర్ సాగర్, కోటరాములు, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రన్నయాదవ్, కొమ్ము ఆంజన్న, పెద్దలింగన్న, రవిసాగర్ పాల్గొన్నారు.

మిల్లుల ముందు పడిగాపులు

- వసుధ రైస్ మిల్లు వద్ద నిలిచిన 200 వాహనాలు
- ధాన్యం అన్‌లోడింగ్‌లో తీవ్ర జాప్యం



భారీగా ధాన్యం లోడుతో నిలిచిన వాహనాలు

కృష్ణ, మే 5 (ఆంధ్రజ్యోతి) : అష్టకష్టాలు పడి పండించి, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యాన్ని, రైస్ మిల్లుకు వెళ్లి దించాలంటే తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లా, కృష్ణమండలం పరిధిలోని గుడెబల్లూరు శివారులో, 167 జాతీయ రహదారి పక్కనున్న పరిజన్య రైస్ మిల్లులో ధాన్యం లోడు దించడంలో తీవ్రమైన జాప్యం జరిగింది. దీంతో ఈ నెల 3న రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. స్పందించిన అధికారులు ధాన్యాన్ని సమీపంలోని వసుధ రైస్‌కు తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో వారు ధాన్యం లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు, లారీలు, బొలెరో వాహనాలను ఇందుపూర్ నుంచి నల్లగట్టుకు వెళ్లే బీటీ రోడ్డు పక్కనున్న ఆ రైస్‌మిల్లుకు తీసుకెళ్లారు.

ప్రతీ రోజు 6 వాహనాల అన్‌లోడింగ్

వసుధ రైస్ మిల్లు వద్ద కూలీలు ఎక్కువ మంది లేకపోవడంతో ధాన్యం దించడంలో ఆలస్యం అవుతోంది. దీంతో రెండు రోజులుగా వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సోమవారం మధ్యాహ్నం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా మిల్లు ముందు రహదారిపై 200 వాహనాలు కన్పించాయి. ధాన్యం లోడ్‌ను దించేందుకు రైతులు అక్కడే పడిగాపులు గాస్తున్నారు. ప్రతీ రోజు 6 వాహనాలు మాత్రమే అన్‌లోడ్ అవుతున్నాయని చెప్తున్నారు. దీంతో వాహనాల అద్దె భారం తమపై పడుతోందని అంటున్నారు.

లారీలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తున్నా, కొనుగోలు చేస్తున్న ధాన్యం తరలింపునకు సరిపోవడం లేదు. దీంతో రైతులే సొంతంగా వాహనాలను అద్దెకు తీసుకొని ధాన్యాన్ని రైస్ మిల్లులకు తీసుకెళ్లాల్సి వస్తోంది. ట్రాక్టర్‌కు, బొలోరోలకు రోజుకు రూ.1000 నుంచి రూ. 1500 అద్దె చెల్లించాల్సి వస్తోంది. దీంతో వారిపై ఆర్థికభారం పడుతోంది. ఇప్ప టికైనా రైస్ మిల్లు యాజమాన్యం కూలీల సంఖ్యను పెంచి, అన్‌లోడింగ్‌ను వేగవంతం చేసి, వాహనాల రద్దీని తగ్గించే విధంగా చూ డాలని రైతులు కోరుతున్నారు.

రెండు రోజుల నుంచి ఇక్కడే..



మిల్లు వద్దే రెండు రోజుల నుంచి పడిగాపులు కాస్తున్నాను. పది ఎకరాల్లో పండించిన ధాన్యాన్ని నాలుగు ట్రాక్టర్లలో వేసుకొని మిల్లుకు తీసుకొచ్చాను. ఇప్పటివరకు అన్‌లోడ్ కాలేదు. పండించడం కన్నా విక్రయించడమే కష్టంగా మారింది. ప్రతీ రోజు మిల్లుకు వందల సంఖ్యలో వాహనాలు వస్తున్నా మిల్లులో ధాన్యం దించుకోవడంలో ఆలస్యం అవుతోంది. వర్షం వచ్చే అవకాశం ఉంటుందున్నారు కాబట్టి అన్‌లోడ్ వేగవంతం చేయాలి.

- రాఘవేంద్ర, అమ్మమ్మపల్లి, మాగనూరు మండలం

అరుణాచలంకు 10న ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : అరుణాచలం గిరి ప్రదర్శన మరియు దర్శన నిమిత్తం మహబూబ్‌నగర్ నుంచి స్పెషల్ బస్సు ఈనెల 10న సాయంత్రం ఏడు గంటలకు బయలుదేరనున్నట్లు డీఎం సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం కాణికపాకం దర్శనం మరియు గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం రాత్రి వరకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అక్కడ గిరి ప్రదర్శన మరియు దర్శనం చేసుకొని 12న మధ్యాహ్నం తిరిగి ప్రయాణమై 13న ఉదయం మహబూబ్‌నగర్ చేరుకుంటుందని తెలిపారు. అరుణాచలం వెళ్లే భక్తులు మహబూబ్‌నగర్ రిజర్వేషన్ కౌంటర్‌కు వచ్చి బస్సు టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు.

సాగుబడి

(5వ పేజీ తరువాయి)

అవకాశం ఉంది. ప్రధానంగా వరి, కంది, పత్తి, వేరుశనగ వంటి పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. శాస్త్రవేత్తలు కూడా ఆయా పంటల సాగుపై రైతులకు సలహాలు అందించనున్నారు. రైతులు తమ సాగు సమస్యలకు నేరుగా శాస్త్రవేత్తల నుంచి పరిష్కారాలు పొందే అవకాశం ఉంటుంది.

నేడు ఏదుల మండల కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 7వ తేదీన పామిరెడ్డిపల్లి, 15వ తేదీన చెన్నారం, 17వ తేదీన చెన్నూరు, 19వ తేదీన శాఖాపూర్, 27వ తేదీన పాలెం, జూన్ 3న అప్పారెడ్డిపల్లి, 4న ఆరేపల్లి, 5న పర్వతాపూర్, 8న కొప్పునూరు, 10న పెద్దగూడెం, 11న కమాలొద్దిన్‌పూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 8వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సక్రియనాయక్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 5వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు కొనసాగుతాయని పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ సుధాకర్ తెలిపారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సాగులో ఎదురయ్యే సమస్యలపై రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడి సలహాలు పొందవచ్చు. శాస్త్రవేత్తల సూచనలతో సాగులో అనవసర ఖర్చులు తగ్గించి దిగుబడి పెంచుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది.

- గోవిందు నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

నారాయణపేట జిల్లాలోని 5 గ్రామాల్లో..

నారాయణపేట (ఆంధ్రజ్యోతి): రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లాలో ఐదు గ్రామాలను ఎంపిక చేశారు. జిల్లాలోని మద్దూర్, గుండుమాల్, జాజాపూర్, పాతపల్లి, బైరంకొండ, కంసాన్‌పల్లి గ్రామాల్లో శాస్త్రవేత్తలు మంగళవారం నుంచి జూన్ 15వ తేదీ వరకు పర్యటించనున్నారు. వానాకాలంలో సాగు చేయాల్సిన పంటలు, ఎంచుకోవాల్సిన విత్తనాలు, రసాయన ఎరువుల వాడకం తగ్గింపు, నీటి వినియోగం, పంట మార్పిడి, నేల, పర్యావరణ పరిరక్షణ గురించి రైతులకు వివరించనున్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పరిమళ కుమార్, డాక్టర్ జేడీ సరిత కోరారు.

దేశ సమగ్రతకు ఐక్య పోరాటం

- ప్రొఫెసర్ జగ్మోహన్‌సింగ్
- మక్తల్‌లో భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ
- హాజరైన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జగ్మోహన్‌సింగ్

మక్తల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : దేశ సమగ్రత కోసం యువత ఐక్యంగా పోరాడాలని భగత్‌సింగ్ మేనల్లుడు, ప్రొఫెసర్ జగ్మోహన్‌సింగ్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ విగ్రహాన్ని సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆనాటి దేశ సామాజిక పరిస్థితుల్లో భగత్‌సింగ్ స్థాపించిన నవ జవాన్ సభ క్రియాశీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. సమ సమాజం వస్తేనే నిజమైన స్వాతంత్ర్యం అన్నారు. భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. అంతకు ముందు నారాయణపేట చౌరస్తాలో భగత్‌సింగ్ విగ్రహాన్ని జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సీపీఐఎంఎల్ నాయకులు సూర్యం, రాము, కృష్ణ, కిరణ్, బుట్టో, భగవంతులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మాస్‌లైన్ నాయకులు శారద, రాజు, భాస్కర్, ఆనంద్, సంధ్య పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- మాజీ ఎంపీపీ బరిగెల సుదర్శన్


ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులతో మాట్లుడుతున్న సీఐ నాగర్జునగౌడ్

మిడ్జిల్, మే 5: (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం నుంచి చెంచడు ఇసుకను తరలించకుండా అడ్డుకుంటానని చెప్పిన ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని మాజీ ఎంపీపీ బరిగెల సుదర్శన్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు శశిరేఖ బాలు అన్నారు. ఇసుక తరలింపును ఆపాలని సోమవారం రైతులు చేపట్టిన ధర్నాకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. మండలంలోని కొత్తపల్లి శివారులోని పట్టాభూముల పేరుతో ఇసుక తరలించేందుకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలన్నారు. ఇసుక తరలింపునకు అనుమతులిచ్చిన ప్రదేశంలో తమ భూములున్నాయని పేర్కొంటూ రెండు టిప్పర్లను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు, తహసీల్దార్ రాజు అక్కడికి చేరుకున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులున్నాయని, టిప్పర్లను అడ్డుకోవడం సరైందని కాదని వారికి చెప్పారు. తమ భూములకు హద్దురాళ్లను ఏర్పాటు చేసేంత వరకు ఇసుకను తరలించొద్దని రైతులు స్పష్టం చేశారు. తమ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులకు ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండు, నాయకులు జంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కాడయ్య, రఫీ, శేఖర్‌రెడ్డి, నవీన్‌చారి, బంగారు, భీంరాజు, నర్సింహ్మరెడ్డి, రాములు, మతిన్, లక్ష్మణ్‌పవర్, కృష్ణనాయక్, వెంకటయ్య, అయ్యప్పరెడ్డి తదితరులున్నారు.

క్రైం కార్నర్

వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి


నర్సమ్మ(ఫైల్)

పెద్దకొత్తపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆదిరాల గ్రామానికి చెందిన మొల్కలపల్లి నర్సమ్మ(50) అనే మహిళ శనివారం గ్రామ శివారులో చేపట్టిన ఉపాధి హామీ పని చేయడానికి వెళ్ళింది. ఎండలో పని చేయడం వల్ల వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గు రైంది. పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మృతి చెందింది. మృతురాలికి భర్త పెద్ద సింగోటం, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు.

రెండు బైకులు ఢీకొని మహిళ..

▸▸ మరొకరికి తీవ్ర గాయాలు


సుగుణమ్మ (ఫైల్)

గోపాల్‌పేట, మే 5 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొని ఓ మహిళ మృతి చెందగా, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... గోపాల్‌పేట మండలంలో నర్సింగాయిపల్లి గ్రామానికి చెందిన రాకాసి సుగుణమ్మ, అనసూయమ్మ మరికొందరు మహిళలు కలిసి ప్రతీ రోజు మార్నింగ్ వాక్‌కు వె ళ్తుంటారు. సోమవారం తెల్లవారుజామున రోజు లాగే వాకింగ్‌కు వెళ్లారు. మండలానికి చెందిన షేక్ ఖాజా బైక్‌తో అతివే గంగా వచ్చి సుగుణమ్మ(62)ను ఢీకొట్టగా, వెనకాలే వేగంగా వస్తున్న మరో ఓ గుర్తు తెలియని బైక్ రైడర్ కూడా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళ అనసూయమ్మ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, గ్రామస్థులు ఆమెను వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సుగుణమ్మ భర్త రాకాసి ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ కు మార్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఉండవల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై అజాగ్రత్తగా కారు నడుపుతూ వ్యక్తిని ఢీకొనడంతో తలకు, చేతులకు గాయాలయ్యాయని ఉండవల్లి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం వేకువజామున ఉండవల్లి గ్రామ శివారులో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపాన జాతీయ రహదారిపై మొక్కజొన్న సంచులతో ట్రాక్టర్ కర్నూలు మార్కెట్‌కు వెళుతున్నది. ట్రాక్టర్‌పై నుంచి సంచులు కిందపడటంతో యాపదిన్నెకు చెందిన శేఖర్(49) వాటిని తీస్తుండగా అదే సమయంలో వెనుక నుంచి అతివేగంగా వస్తున్న ఒక కారు శేఖర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను రోడ్డుపై పడటంతో తలకు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ట్రాక్టర్ కిందపడి

ఇద్దరు బాలుర మృతి


భరత్ (ఫైల్)


వెంకట్ (ఫైల్)

రేవల్లి/అమరచింత, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రాంతాల్లో ట్రాక్టర్ కింద పడి ఇద్దరు బాలురు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. పొలం దగ్గరికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి 12 ఏళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట గ్రామంలో గొల్ల శంకరయ్య, లక్ష్మీ దంపతులకు నలుగురు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. వీరిలో మూడవ కుమారుడు భరత్ (12). ఆయన ఆదివారం సాయంత్రం తండ్రితో పాటు పొలం దగ్గరికి వెళ్లాడు. తండ్రి పొలం పనులు చూసుకొని అక్కడే ఉండి అదేరాత్రి భరత్‌ను తన సొంత ట్రాక్టర్‌పై ఇంటికి వెళ్లమని పంపాడు. మార్గం మధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను చూసి డ్రైవర్ హఠా త్తుగా బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్ ఇంజన్ మధ్య చక్రంపై గల రేకుపై కూర్చున్న బాలుడు అదుపు తప్పి కింద పడ్డాడు. భరత్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారిం చారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజిత తెలిపారు.

సింగంపేటలో..

● ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ కింద పడి బాలుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి వనపర్తి జిల్లా అమరచింత మండలం సింగంపేట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింగంపేట గ్రామానికి చెందిన వడ్డె శ్రీనివాసులు వడ్డె గోవిందమ్మల కుమారుడు వడ్డె వెంకట్ (12) సింగంపేట గ్రామ స్టేజీ నుంచి ఊరిలోకి ట్రాక్టర్‌పై వెళ్తున్నాడు. ట్రాక్టర్ ఎడమ భాగం కూర్చొని వెళ్తున్న వెంకట్ గుంతల రోడ్డులో ప్రమాదవశాత్తు జారిపడి ట్రాక్టర్ రైట్ సైడ్ టైర్ కింద పడ్డాడు.

దీంతో హుటాహుటిన ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు చుట్టుపక్కల వారు వచ్చి ఆ బాలుడిని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ముఖానికి, ఎదభాగం, తలకు తీవ్ర గాయాలు కావడంతో బాలుడు మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. బాలుడు వెంకట్ ఆత్మకూరు ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఏడవ తరగతి పూర్తి చేశాడు. తల్లిదండ్రులకు ముగ్గురు కుమార్తెల తరువాత చివరిగా కుమారుడు వెంకట్ కావడంతో పుత్రశోకంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. బాలుడి మృతిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు.

మట్టి టిప్పర్ స్వాధీనం

ఉండవల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి లేకుండా మట్టి లోడుతో వెళుతున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నామని సోమవారం ఉండవల్లి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అలంపూర్ క్రాస్ రోడ్డులో సోమవారం ఉదయం బ్లూ కోల్ట్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల ఖాదర్ పాషా, రవీంద్రలు టిప్పర్‌ను ఆపి తనిఖీ చేశారు.

కర్నూలుకు చెందిన డ్రైవర్ జింకల ప్రసాద్ పోతుల పాడు శివారు నుంచి అలంపూర్ క్రాస్ రోడ్డుకు మట్టిని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. డ్రైవర్ వద్ద మట్టి రవాణా అనుమ తుల పత్రం లేకపోవడంతో టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్ ఐ తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సారా బంధు పెట్టి.. పొలం బాట పట్టి..


కొత్తకోట చౌరస్తాలో ఆకు కూరలు అమ్ముతున్న గిరిజన మహిళలు


ఈదులబావి తండాలో సాగు చేసుకున్న ఆకు కూరల తోటలు

- ● ఆకు కూరల సాగుతో ఆర్థిక వృద్ధి
- ● చేతి నిండా పని.. ప్రతీ రోజు డబ్బు
- ● తండాల్లో మారిన గిరిజనుల జీవితం

కొత్తకోట, మే 5 (ఆంధ్రజ్యోతి) : పొలాల మధ్య రహస్యంగా సారా కాస్తూ, ఎక్సైజ్, పోలీసు అధికారులకు నిత్యం భయపడుతూ జీవించే వారు.. సారా తయారీ, విక్రయమే ఆధారంగా జీవనం సాగించేవారు.. కేసుల పాలై, పోలీస్‌స్టేషన్లు, జైళ్ల చుట్టూ తిరుగుతూ, అప్పుల భారంతో అష్టకష్టాలు పడుతుండేవారు.. ఇదంతా గతం.. ఐదారేళ్లుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒకరిని చూసి ఒకరు తమ జీవనశైలిని మార్చుకున్నారు. కూరగాయల సాగుపై దృష్టి సారించారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని తండాల్లోని గిరిజనుల జీవితాల్లో వచ్చిన మార్పుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

సారా తయారీ, విక్రయం

కొత్తకోట మండలంలో ఈదులబాయి తండా, సంకిరెడ్డిపల్లి తండా, కానాయపల్లి తండా, నాటవెల్లి పెద్ద తండా, నాంచారమ్మపేట తండా, ఒట్లంపూడి తండా, పడ్డెవాట తండా, జయరాం తండాలున్నాయి. వాటిల్లో కొన్ని గిరిజన కుటుంబాలు సారా తయారీ, విక్రయాలతో జీవనం సాగించేవారు. ఈ దందాను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకున్నది. దీంతో గిరిజనులు తరుచూ ఎక్సైజ్, పోలీసుల దాడుల్లో చిక్కి కేసుల పాలయ్యేవారు. కోర్టుల చుట్టూ తిరిగి అప్పుల పాలయ్యేవారు. దీంతో వారి పిల్లలు, కుటుంబ సభ్యులు తీవ్రమైన ఇబ్బందులు పడేవారు.

ఒకరిని చూసి మరొకరు..

వనపర్తి జిల్లా కేంద్రం సమీపంలో శ్రీనివాసపురంలో చాలా ఏళ్లుగా ఎక్కువ మంది రైతులు ఆకు కూరలు సాగు చేసి, విక్రయించి జీవనం గడుపుతున్నారు. వారిని చూసి ఈదులబాయి తండాకు చెందిన వారు కొందరు గిరిజనులు నాలుగేళ్ల క్రితం ఆకుకూరల సాగుపై దృష్టి సారించారు. వారిని చూసి మిగతా తండాల్లోనూ గిరిజనులు పొలంబాట పట్టి, కూరగాయలు సాగు చేయడం మొదలు పెట్టారు. ఆయా తండాల్లో రైతులు వర్షాకాలంలో పంట కాలువల ద్వారా వచ్చిన నీటితో.. మిగతా సమయాల్లో బోర్లు, బావుల నీటితో ఆకు కూరలు సాగు చేస్తున్నారు. వర్షాకాలం, యాసంగిల్లో వివిధ పంటలు పండించిన రైతులు వేసవిలో పొలాలను దుక్కి చేస్తున్నారు. కానీ తండాల్లో గిరిజనులు మాత్రం వేసవిలో ఊరికే ఉండకుండా వారికున్న పొలంలో రెండు చిన్న మడులు ఏర్పాటు చేసుకొని విడతల వారీగా ఆకు కూరలు సాగు చేస్తూ ఇంటిల్లిపాది పని కల్పించుకుంటున్నారు. తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

పెరుగుతున్న ఆకుకూరల సాగు

మండలంలోని తండాల్లో ఒకరిని చూచి మరొకరు ఆకు కూరల సాగుపై దృష్టి పెట్టారు. పుంటి కూర, తోట కూర, మెంతెంకూర, పాలకూర,, కొత్తిమీరతో పాటు కూరగాయలు పండిస్తున్నారు. ఆకు కూర విత్తనాలు చల్లిన ఇరవై రోజుల తర్వాత కోతకు వస్తుంది. ఒక మడి కోతకు రాక ముందే, మరొక మడిలో విత్తనాలు చల్లుతున్నారు. ఇలా ప్రణాళిక ప్రకారం విత్తనాలు చల్లి నీరు పెడుతున్నారు. సాయంత్రం ఆకు కూరలను కోసి కట్టలు కడుతారు. మరుసాటి రోజు ఉదయమే పట్టణాలకు వెళ్లి డిమాండ్‌కు తగ్గట్లుగా కట్ట సైజును బట్టి రూ. 10 కి మూడు, రూ.20కి ఐదు చొప్పున విక్రయిస్తున్నారు. అలాగే వారంతపు సంతలు, కూరగాయాల మార్కెట్లో వ్యాపారులకు గుత్తగా అమ్ముకుంటున్నారు. ఇలా వారు ఆర్థికంగా స్థిరపడటంతో పాటు పిల్లలను చక్కగా చదివించుకుంటూ గౌరవప్రదమైన జీవనం గడుపుతుఆన్నరు.

రోజుకు రూ. మూడు, నాలుగు వందలు



ఎండ కాలంలో కూలీ పనులు తక్కువగా ఉంటాయి. పనులకు వెళ్లకుండా మా పొలంలోనే ఆకు కూర్యజీ సాగు చేసుకున్నాం. ఆలుమగలం కష్టపడుతున్నాం. రోజుకోక ఊరు కొత్తకోట, వనపర్తి, పెబ్బేర్‌లకు వెళ్లి ఆకు కూరలు అమ్ముతే మూడు నాలుగు వందల రూపాయలు వస్తాయి. ఉపాధి పనులకు పోతే ఇవీ కూడా రావు. మా పొలంలో మా పని మేము చేసుకొని బతుకడం ఆనందంగా ఉంది.

– అలివేల, సంకిరెడ్డిపల్లి తండా

పని లేకుంటే బతుకు కష్టం



మాకు భూమి తక్కువగా ఉంది. ఏడాదిలో రెండు పంటలు పండిస్తే వచ్చే డబ్బులు మా పిల్లల చదువులు, కుటుంబ పోషణకు సరిపోదు. ఎండ కాలంలో ఊరికే ఉండకుండా ఆకు కూరలు పండిస్తున్నాం. మాది పెద్ద కుటుంబం. పని లేకుంటే బతకడం కష్టం. ఎవరినీ అప్పు అడగకుండా మా బతుకు మేము బతుకుతున్నాం.

– బోజ్యా నాయక్, ఈదులబావి తండా

పందిర్లు వేసుకుంటే మంచిది



ఆకు కూరలు సాగు చేసే రైతులు విత్తనాలు చల్లిన నాటి నుంచి మొలకలకు ఎండ తగుల కుండా పందిర్లు వేసుకుంటే మంచిది. లేకపోతే ఎండ తీవ్రతకు ఆకు కూర మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉంది. మొక్కలు ఎదిగే వరకు స్ప్రింకర్లతో క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలి. చీడపీడలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరం అయితే వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి.

– దామోదర్, ఏడీఏ, కొత్తకోట

వైభవంగా శేషదాసుల రథోత్సవం


ఆలయ ప్రాంగణంలో జరిగిన రథోత్సవంలో పాల్గొన్న శేషదాస వంశీయులు

మల్దకల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రంలోని ఆదిశిలాక్షేత్రం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శేషదాసుల ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం మధ్యారాధన, పవమాన హోమం నిర్వహించారు. అనంతరం శేషదాసుల రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. దేవాలయం నుంచి శేషదాసుల కట్ట వరకు రథాన్ని ఊరేగించారు. సాయంత్రం వేదపండితులు, రాఘవేంద్రాచారి, పవమానాచారి, గురుప్రసాదాచారి, జయరామాచారి, శశాంక్‌దాస్‌లు పురాణ ప్రవచనం చేశారు. వెంకోబరావు కుమారుడు వరదేంద్ర సంగీత కచేరీ నిర్వహించారు. కేటీదొడ్డి ఎంఈవో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శేషదాస వంశీయులు శేషగిరిరావు, ధీరేంద్రదాసు, రాఘవేంద్రదాసు, విష్ణు, శశాంక, ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు, భీమసేనాచారి, చాగాపురం ప్రదీప్, మోహన్‌రావు, రమేశ్, గిరిరావు, మధుసూదన్‌రావు, బాబురావు, మనోహర్‌రావు, సీతారామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

పరిశోధనలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలి

▸▸ ఎంపీ మల్లు రవి



రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

వంగూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తలు పరిశోధనలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలోని రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల సమన్వయంతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ మల్లురవితో పాటు రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. అనంతరం కేవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ పంట మార్పిడి పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు పొందేందుకు వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ రైతులందరూ సేంద్రియ, పచ్చిరొట్ట, జీవన ఎరువులను వాడాలని సూచించారు.

వ్యవసాయ పరిశోధన సంచాలకుడు బాల్‌రాం మాట్లాడుతూ కొండారెడ్డిపల్లిని దత్తత గ్రామంగా తీసుకొని రాబోయే రోజుల్లో వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతానన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వెంకటేశం, రఘునాథరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, శైల, పండిత్‌రావు, మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, పులిజాల కృష్ణారెడ్డి, బొజ్జ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ బస్టాండులో బంగారం అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ బస్టాండులో మూడు తులాల బంగారు పుస్తెలతాడు ఆదివారం అపహరణకు గురైనట్లు ఎస్ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం... వనపర్తికి చెందిన ఉప్పునుంతల సరిత అచ్చంపేటలోని గ్రామదేవత పండుగకు వెళ్తున్న క్రమంలో నాగర్‌కర్నూల్ బస్టాండులో అచ్చంపేట బస్‌స్టాప్ దగ్గర తన మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడు అపహరణకు గురైనట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అచ్చంపేట బస్‌స్టాప్ దగ్గర బస్సు కోసం వేచి ఉండగా అపహరణకు గురైంది.

అచ్చంపేటకు వెళ్లి తమ పర్సులు, బ్యాగులు అన్ని పరిశీలించగా కనిపించకపోవడంతో సోమవారం వచ్చి నాగర్‌కర్నూల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ

▸▸ బీఆర్ఎస్వీ జిల్లా కార్యదర్శి కుర్వ పల్లయ్య

▸▸ కలెక్టరేట్ ఎదుట ఆందోళన


కలెక్టరేట్ వద్ద వినతిపత్రంతో రైతులు

గద్వాల న్యూటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువుదోపిడీ చేస్తోందని బీఆర్ఎస్వీ జిల్లా కార్యదర్శి కుర్వ పల్లయ్య అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 69 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రతీ బస్తాకు 700 గ్రాముల ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారన్నారు. తీసుకున్న వడ్లను బినామీ పేర్లతో విక్రయించి డబ్బు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించాలని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో లక్ష్మన్న, తేజ, తిమ్మప్ప, నరసిం హులు, నాగరాజు, జయన్న తదితరులు ఉన్నారు.

గంజ్ వ్యాపారి దివాలా

▸▸ రూ.4.78కోట్లకు ఐపీ ▸▸ 44మందికి నోటీసులు

గద్వాల, మే 5 (ఆంధ్రజ్యోతి) గద్వాల వ్యవసాయ మార్కెట్‌లో ఖరీదుదారుడిగా వ్యాపారం చేస్తున్న శ్రీసాయిరామ్ ట్రేడర్స్ యజమాని నాయకి విష్ణు దివాలా తీయడంతో ఐపీ పెట్టాడు. 44మందికి రూ.4.78కోట్లు చెల్లించాల్సి ఉందని, తాను ఆ మొత్తం చెల్లించలేని పరిస్థితిలో ఉన్నానని అందులో పేర్కొన్నాడు. దీంతో ఆయనతో వ్యాపారం చేస్తున్న 40మంది వ్యాపారులతో పాటు అప్పు ఇచ్చిన మరో నలుగురికి నోటీసులు జారీ అయ్యాయి. ఇందుకు సంబంధించి వ్యాపార వర్గాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాలలో గత 20ఏళ్లుగా వేరుశనగ వ్యాపారం చేస్తూ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలుదారుడిగా ఉన్నాడు. మార్కెట్ కమీషన్ మర్చంట్స్‌తో పాటు తన ఎగుమతుల వ్యాపారుల వద్ద కూడా మంచి పలుకుబడి నమ్మకంతో వ్యాపారం చేశాడు. ఒక్క గద్వాలనే కాకుండా మహబూబ్ నగర్, జడ్చర్ల, షాద్‌నగర్ వంటి మార్కెట్‌లో కూడా వ్యాపార కార్యకలాపాలు చేశాడు. అయితే గత ఏడాది నుంచి వ్యాపారంలో విపరీతమైన నష్టాలు వచ్చాయి. ధరలు పడిపోవడం, కొనుగోలు చేసిన వేరుశనగ విక్రయాలలో నష్టాలు రావడంతో అప్పులు మిగిలిపోయాయి. దీంతో చెల్లింపులు సక్రమంగా చేయకపోవడం, వ్యాపారం కొనసాగించేందుకు ముందు తేదీలతో చెక్కులను జారీ చేయడం వంటివి చేస్తూ వచ్చాడు. అయితే ఇచ్చిన చెక్కులు బ్యాంకుల్లో చెల్లుబాటు కాకపోవడం, వాటిని తిరిగి చెల్లించేందుకు అప్పులు చేయడం వంటివి చేశాడు. దీంతో మరింత నష్టాల్లోకి పోయాడు. వ్యాపారులు, కమీషన్ మర్చంట్స్, అప్పుదారుల నుంచి విపరీతమైన ఒత్తిడి పెరిగిపోవడంతో కోర్టులో ఐపీ దాఖలు(దివాలదారుడిగా) చేశాడు. గద్వాలలో రూ.3.40కోట్లు, జడ్చర్ల, మహబూబ్ నగర్, షాద్‌నగర్‌లలో రూ.1.38కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే తన పేరుపై ఉన్న మొత్తం ఆస్తులు రూ.13లక్షలు మాత్రమే ఉందని అందులో పేర్కొన్నట్లు బాధితులు, వ్యాపారవర్గాలు తెలిపాయి.

అంగన్‌వాడీ టీచర్లకు సెలవులు లేనట్లేనా?

▸▸ ప్రభుత్వం ప్రకటించినా, అందని ఉత్తర్వులు



గర్భిణులకు పౌష్టికాహారం, గుడ్లు అందజేస్తున్న టీచర్

వనపర్తి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లకు సెలవులు లేనట్లేనా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా వేసవి సెలవులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. కానీ జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయానికి మాత్రం ఇప్పటి వరకు రాలేదు. దీంతో గతంలో మాదిరిగానే పిల్లలకు మాత్రమే వేసవి సెలవులు వర్తిస్తాయి. అంగన్‌వాడీ టీచర్లు ఒకటి నుంచి 15 వరకు, 16 నుంచి 31 వరకు ఆయాలు విధుల్లో ఉంటున్నారు. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని యథావిధిగా అందిస్తున్నారు. టీచర్లు ఉండి ఆయాలు లేని, ఆయాలు ఉండి టీచర్లు లేని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలలో 15 రోజులు లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో ఇరుకైన అద్దె భవనాల్లో, ఉక్కపోత మధ్య టీచర్లు, ఆయాలు విధులు నిర్వర్తించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ సంఘాల నాయకులు ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి పరిస్థితిని వివరించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జిల్లా కార్యాలయానికి మాత్రం ఆ ఉత్తర్వులు ఇప్పటివరకు అందలేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు యథావిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

వనపర్తి జిల్లాలో 589 కేంద్రాలు

వనపర్తి జిల్లాలోని 3 ప్రాజెక్టుల కింద 589 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,418 మంది గర్భిణులు, 1,941 మంది బాలింతలు, 20,621 మంది చిన్నారులు, మొత్తంగా 24,980 మంది ఉన్నారు. ఆయా కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లబ్ధిదారులకు గడ్లు, పాలు, పౌష్టికాహారాన్ని యధావిధిగా పంపిణీ చేస్తున్నారు. ఇళ్లను సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాడి, చిన్నారులను ప్రీస్కూళ్లలో చేర్పించడం, బడి మానేసిన పిల్లలను గుర్తించి ప్రవేశాలు కల్పించడం, ఐదేళ్లలోపు పిల్లలు ఎదుగుదలకు సంబంధించిన వివరాల నమోదు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంత్రి సీతక్క ప్రకటనతో అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు వేసవి సెలవులు ఉంటాయని సంతోషపడిన వారు నిరాశకు గురవుతున్నారు.

యథావిధిగా విధులు



మంత్రి సీతక్క ప్రకటించింది వాస్తవమే కానీ, అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇప్పటివరకు మాకు అందలేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు సెలవులు లేవు. గతంలో మాదిరిగానే విధులు నిర్వర్తించాలి. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి. మూడేళ్ల చిన్నారులను గుర్తించి జూన్‌లో కేంద్రాల్లో చేర్పించేలా ఇంటింటి సర్వే చేయాల్సి ఉంటుంది.

– సుధారాణి, డీడబ్ల్యూవో

న్యూస్ బాక్స్

స్వీపర్ల వేతనాలు ఇచ్చేందుకు కలెక్టర్ హామీ

పాలమూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేసే స్కూల్ స్వీపర్లకు పెండింగ్ వేతనాలు అందజేసేందుకు కలెక్టర్ విజయేందిర బోయి హామీ ఇచ్చినట్లు స్కూల్ స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రాయుడు తెలిపారు. సోమవారం కలెక్టర్‌ను కలిసిన స్కూల్ స్వీపర్ల ప్రతినిధి బృందంతో కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. గౌరవ వేతనం రూ.5200 ఇచ్చేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బాలరాజు, నాగరాజు, నరసింహులు, రాములు, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, జమీర్‌బాష, జంగయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

నవాబ్‌పేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మనగండ్ల గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొల్లూర్ విష్ణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కళాకారుల ఆటపాటలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని, మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

భగీరథ మహర్షికి నివాళి అర్పించని కాంగ్రెస్, బీజేపీ

పాలమూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నివాళి అర్పించకుండా అవమానించాయని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలోని గ్రీన్‌బెల్ట్ ఏరియాలో మహర్షి భగీరథ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించినప్పటికీ కాంగ్రెస్, బీజేపీ నుంచి ఒక్కరు కూడా పాల్గొనకపోవటం అవమానించటమే అన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


ఆంజనేయులు (ఫైల్)

కొల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు గురై వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం చంద్రాసుపల్లికి చెందిన వడ్డె అంజనేయులు (22) మరికొందరితో పాటు ఇటీవల బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలో గొర్రెలు మేపుకునేందుకు వలస వచ్చాడు. ఆదివారం క్రాస్ రోడ్డు సమీపంలోని పొలాల్లో గొర్రెలను కాస్తూ సెల్ ఫోన్‌లో మాట్లాడుతుండగా పాటు పిడుగు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన అతని సోదరుడు, తోటి గొర్రెల కాపరులు యువకుడిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తీసుకెళ్లగా గుంటూరులోని సమగ్ర ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని సోదరుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సంతాపం

మూసాపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన అడ్డాకుల ఉమ్మడి మండల జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎ.విద్యావతమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆమె మృతదేహానికి నివాళి అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీలు బగ్గి కృష్ణయ్య, నాగార్జున్‌రెడ్డి, మండల నాయకులు నాగిరెడ్డి, శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, జగదీశ్వర్, రాంచందర్, లక్ష్మీ నారాయణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు విచారకరం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రిటైర్మెంట్ అయిన ప్రభుత్వ ఉద్యోగులు తమకు రావాల్సి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 14 నెలలుగా ఎదురు చూస్తుంటే వాటిని విడుదల చేయాల్సిన ప్రభుత్వం విడుదల చేయకపోగా, సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు విచారకరమని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఎస్ వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అక్టోబరు 24న జేఏసీ ప్రతినిధులతో మూడు గంటల పాటు సమావేశమై ఉద్యోగుల సమస్యలు విన్న సీఎం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించి సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుందామని చెప్పారు. మాటిచ్చి 6 నెలలు గడుస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

బంగారం, నగదు చోరీ

మహమ్మదాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుర్కషేక్‌పల్లి గ్రామంలో గత నెల 27న బెస్త నర్సమ్మ ఇంట్లోకి ఉదయం 11 గంటలకు చోరీ జరిగింది. చౌదర్‌పల్లికి చెందిన అరుణమ్మ, నాగమణి బీరువాలో ఉన్న రెండు ముక్కుపుల్లలు, రూ.4 వేలు దొంగిలించినట్లు సోమవారం బెస్త నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధి పనులకు ఆటంకం

» భూత్పూర్ 4వ వార్డులో నిలిచిన డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణాలు

» ఏళ్లు గడుస్తున్నా.. అభివృద్ధికి నోచుకోని ఇందిరానగర్ కాలనీ



4వ వార్డులో నిర్మాణం కోసం తవ్వి వదిలిపెట్టిన డ్రైనేజీ కాల్వ

భూత్పూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది ఓ కాలనీ.. అంతే కాదు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం పనులు ప్రారంభించిన గుత్తేదారు మధ్యలోనే పనులు వదిలి వెళ్లడంతో అసలు సమస్య మొదలైంది. వివరాల్లోకి వెళ్తే.. భూత్పూర్ మునిసిపాలిటీలోని 4వ వార్డును ఇందిరమ్మ కాలనీ అని పిలుస్తారు. గ్రామం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అభివృద్ధిలో మాత్రం వెనకబడి ఉంది. ఈ కాలనీలో దాదాపుగా 3వేలకు పైగా జనాభా ఉండగా, 85 శాతం దళితులే నివాసం ఉంటారు. ఇదిలా ఉంటే కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం మునిసిపాలిటీ నిధుల నుంచి రూ.కోటి మంజూరు కాగా పనులు కూడా ప్రారంభించారు. ప్రధాన సమస్యలు పరిష్కారం అవుతాయని కాలనీవాసులు సంబురపడినా.. నెల రోజులుగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం..

కాలనీలో కొంత మంది సీసీ రోడ్డు, డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులు చేపట్టకుండా అడ్డుకున్నారు. వారందరితో మాట్లాడడం జరిగింది. నిలిచిపోయిన పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తాం.

- వినోద్‌కుమార్, ఏఈ

శిథిలావస్థలో మంచి నీటి ట్యాంకు


ట్యాంకు నుంచి నీరు లీకైతున్న దృశ్యం

26 జూన్ 2004లో లక్ష లీటర్ల సామర్థ్యంతో రక్షిత మంచి నీటి ట్యాంకును నిర్మించారు. ఇప్పుడు ఆ ట్యాంకు శిథిలావస్థకు చేరుకొని ట్యాంకు నాలుగు పిల్లర్లు ఇనుప చువ్వలు తేలి ప్రమాదభరితంగా మారింది. ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకును తొలగించి కాలనీవాసులు కోరుతున్నారు.

ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉంది..



నా ఇంటి దగ్గర లోతుగా డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వారు. ఇంటికి మెట్ల కింద త్వడంతో మురుగు నీరు అంతా మా ఇంటి దగ్గర చేరి ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే పనులు చేపట్టాలి.

- ఖాజాబీ, కాలనీవాసి

స్థానికులు అడ్డుకుంటున్నారు..



మునిసిపాలిటీ నుంచి సీసీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.కోటి మంజూరు కాగా, పనులు కూడా ప్రారంభించారు. అయితే కొందరు కాలనీవాసులు పనులు జరగకుండా ఆపుతున్నారు. అందరు సహకరిస్తే అభివృద్ధి పనులు జరుగుతాయి.

- శ్రీకాంత్, కాలనీవాసి

కంకర వేసి వదిలేశారు..



రోడ్డు కోసం కంకర వేసి వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు కాల్వల్లో పడిపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభిస్తే బాగుంటది.

- గద్దం ప్రేమ్‌కుమార్

ఓడీఎఫ్ మోడల్ గ్రామాలుగా ప్రకటించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, (స్వచ్ఛభారత్ దీవాస్) అక్టోబరు 2, 2025 వరకు 100 శాతం పూర్తి చేసి ఓడీఎఫ్ (+) మోడల్ గ్రామాలుగా ప్రకటించాలని కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2026 మార్చి 31 లోపు స్వచ్ఛభారత్ కింద చేపట్టనున్న అన్ని నిర్మాణ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్లు 8,130, సామూహిక మరుగుదొడ్లు 12, వ్యక్తిగత ఇంకుడుగుంతలు 4,939, సామూహిక ఇంకుడు గుంతలు 746, చెత్తసేకరణ అండ్ ఎరువుల తయారీ కేంద్రానికి 15 రోజుల్లోపు మంజూరురు తీసుకొని పనులను ప్రారంభించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. మొదటి దశలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు మార్క్ ఔట్ చేసి గ్రౌండింగ్ చేయాలని ప్రత్యేకాధికారులను ఆదేశించారు. రెండో దశలో వెరిఫికేషన్ పూర్తైన వాటికి మంజూరు ఇస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాసం తుది జాబితాను ఈ నెల 15లోగా బ్యాంకర్లకు పంపించాలని, వేసవిలో తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలన్నారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్డీవో నర్సింహులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 83 ఫిర్యాదులు

ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 83 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ ఘాన్సీరామ్, పాల్గొన్నారు.

కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటాలి

» జిల్లా వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య » కరాటే శిక్షణ శిబిరం ప్రారంభం


కరాటే వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న చెన్న వీరయ్య


వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు రవిశంకర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్, కరాటేలో ప్రతిభ చాటాలని వాలీబాల్ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య అన్నారు. కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహాత్మగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో ఉచిత వేసవి కరాటే శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం చెన్నవీరయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో బాలికలు ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. వేసవి కరాటే శిబిరాన్ని చిన్నారులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కింగ్‌షోటోకాన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్‌పటేల్, కార్యదర్శి జకీ, బాలు మహేందర్‌నాయక్, తిరుపతయ్య, అత్తర్ అహ్మద్, ఖాజాపాష పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో మానసిక ఉల్లాసం

జడ్చర్ల : మార్షల్ ఆర్ట్స్‌తో మానసిక వికాసం కలుగుతోందని ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాదిమి రవిశంకర్ అన్నారు. సోమవారం జడ్చర్ల మినీ స్టేడియం మైదానంలో ప్లేవాక్ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి, సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రనీల్‌చందర్, కెఎఫ్ఎస్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ తాజుద్దీన్, మురళి, ఖాదర్‌పాషతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటో ఖాన్ జడ్చర్ల సౌజన్యంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేఎఫ్ఎస్ జిల్లా అధ్యక్షుడు కిట్టు, ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజా, మొయినోద్దీన్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌కుమార్ గౌడ్, కోశాధికారి అబ్దుల్లా, బంగారయ్య, కార్యదర్శి నవీన్, ఎండీ సోహెల్, కార్యనిర్వాహణ కార్యదర్శి శ్రీనివాసులు, ఈసీ మెంబర్ జస్మిత, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైదిక బాలుర యువశక్తి శిక్షణ ప్రారంభం


జ్యోతి వెలిగించి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్య సమాజ్ అధ్యక్షుడు వేద సింధు

జడ్చర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్యసమాజం, దయానంద విద్యాలయం ఆధ్వర్యంలో జడ్చర్లలో సోమవారం 5 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు వైదిక బాలుర యువశక్తి నిర్మాణ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరంలో నైతిక విలువలు, మహాపురుషుల జీవిత చరిత్రలు, సంధ్య, దైవజ్ఞం, దేశభక్తి, దైవభక్తి, వేద, మంత్రోచ్చరణ, కరాటే, ఆటలు, సాంస్కృతిక అంశాలు నేర్పిస్తారని సభ అధ్యక్షుడు ఆర్యసమాజ్ ఆచార్య వేద సింధు అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కోనేటి పుష్పలత జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థుల్లో ఈ విద్యను అభ్యసించటం వల్ల క్రమశిక్షణ, ఆదర్శంగా ఎదగడానికి అవకాశం ఉందన్నారు. సంగీత నాటక అకాడమి చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతో పాటు సామాజిక అంశాలు అభ్యసిస్తే ఉన్నత స్థాయి విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు. ఆచార్యులు బాణాల ప్రభాకర్, ప్రణవముని ధర్, వేద ధర్మముని నరసయ్య, కరుణాకర్, సింగ్, సిద్ధిరామయ్య, భాగ్యనగర్, జాతీయ సాహిత్య పరిషత్ సభ్యులు ఉమెమంతల మహేశ్వర్, సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు శక్తి మూర్తి లావణ్య, ఆర్య, గుబ్బ నరసింహులు, జయకుమార్, బక్క రాజేశ్వరరావు, లవకుమార్, పొట్టి శ్రీను, దయామందిర్ కృష్ణయ్య, అంజనాచారి, స్రవంతి, నందిని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దేవరకద్ర, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మెనేజ్‌మెంట్ నుంచి లైసెన్స్ సర్వేయర్‌కు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. డిప్లామా సివిల్, బీటెక్ సివిల్, ఇంటర్మీడియట్ గణితంలో 60 శాతం మార్కులతో, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్ సివిల్ చదివిన అభ్యర్థులు మీ సేవ కేంద్రాల ద్వారా ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నెలలో మొదటి బుధవారం ప్రత్యేక ప్రజావాణి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధుల వెసులుబాటు కోసం ప్రతీ నెల మొదటి బుధవారం స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జరీనాబేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని, దివ్యాంగులు, వయోవృద్ధులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాలమూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశ, వీవోఏ, హమాలీలు, భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి కోరారు. సోమవారం కలెక్టర్ విజయేందిర బోయికి కార్మికులతో కలిసి ఈనెల 20న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సమ్మె నోటీసును అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ బోనస్ గ్రాట్యూటీ, పెన్షన్, 8 గంటల పని విధానం, ప్రైవేటీకరణ సరళీకరణ ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాలు రద్దు చేయాలని ప్రభుత్వ రంగాలను బలోపేతం చేయాలనే డిమాండ్లతో సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, సీనియర్ నాయకులు ఖమర్‌అలీ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ వెంకటేష్‌గౌడ్, నారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులే సమాజ నిర్మాతలు



మాట్లాడుతున్న విజేత వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులే సమాజ నిర్మాతలని వారు తలుచుకుంటే సమాజ గతినే మార్చగలరని వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, విద్యావేత్త విజేత వెంకట్ రెడ్డి అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్, డ్రీంపోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాగ్దేవి జూనియర్ కళాశాలలో నిర్వహించిన సైన్స్ వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. 12 రోజుల పాటు జరిగిన వేసవి శిక్షణ శిబిరం తమకు ఎంతో ప్రేరణ ఇచ్చిందన్నారు. కలాం ల్యాబ్ అధ్యక్షుడు జనార్దన్, కార్యదర్శి శ్రీనివాస్, సలహాదారు కరుణాకర్‌గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా అధికారి రాజశేఖర్, సభ్యులు అనురాధ, సురేఖ, మహిపాల్, శేఖర్, కమిటీ కోఆర్డినేటర్ చక్రవర్తి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ముస్లిం సంఘం ఆధ్వర్యంలో మెహందీ, కంప్యూటర్ కోర్సులు పూర్తైన మహిళలు, యువతులకు సోమవారం షాషాబ్‌గుట్టలో ఏర్పాటు చేసిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. యువతీ యువకులు స్వయం ఉపాధిలో రాణించేందుకు కార్పొరేషన్ తోడుగా ఉంటుందన్నారు. కార్పొరేషన్ తరుపున రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించి శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. త్వరలో సబ్సిడీ రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాంగ్రెస్ నాయకుడు తాహెర్, ముస్లిం సంఘం సభ్యులు రహెమాన్, బషీరుద్దీన్, ఖాజామైనాద్దీన్, ఖదీర్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన డీఈవో


విద్యార్థులను బొకే ఇస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 5 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని న్యూ ప్రేమ్‌నగర్‌లో గల లిటిల్‌రోజ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జయభేరి మోగించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులు అక్షయ 542 , అశ్విని 532, హరికృష్ణ 501, వి.కార్తీక్ 500 సాధించడంతో డీఈవో ప్రవీణ్‌కుమార్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మొరాజుల్లాఖాన్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో లిటిల్‌రోజ్ పాఠశాల కరస్పాండెంట్ హిరేకారి రాంచందర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పుష్పాభిషేకం


ప్రత్యేక పూజలో పాల్గొన్న కాలనీవాసులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప కొండపై మాలిక పురోత్తమ మాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గణపతి హోమంతో ప్రారంభమైన పూజలు, అమ్మవారికి అష్టాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు హనుమేష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు భగవంతురావు, కోశాధికారి చంద్రశేఖర్ యాదవ్, ముత్యం, విజయ్ కుమార్, మాల్యాద్రి, మంతరవి, వెంకట్‌రెడ్డి, ఏఎంసీ ప్రభాకర్, ప్రమోద్, శెట్టి శేఖర్, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి ఫిర్యాదు


డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న కేవీపీఎస్ ప్రతినిధులు

పాలమూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన దళిత యువకుడి భార్య కిడ్నాప్‌కు గురైంది. కిడ్నాప్ చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యంరాజు, కుర్మయ్య, ఆదివిష్ణువర్ధన్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని శివశక్తినగర్‌కు చెందిన దళిత యువకుడు నరేష్, ఆంధ్రాకు చెందిన అమ్మాయి దివ్య మార్చి 2న పెళ్లి చేసుకున్నారు. ఈ జంట శివశక్తినగర్‌లో నివసిస్తున్నారు. అమ్మాయి బంధువులు సోమవారం ఉదయం కిడ్నాప్ చేసి తీసుకువెళ్లారు. అమ్మాయికి ప్రాణహాని తలపెట్టే ప్రమాదం ఉందన్నారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి రక్షణ కల్పించి దివ్యను తిరిగి తనకు అప్పగించాలని డీఎస్పీని కేవీపీఎస్ ప్రతినిధులు కోరారు.

ప్రజల నుంచి దూరం చేయలేరు


ఎస్ఐ భాస్కర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నచింతకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఫ్లెక్సీలు చింపేసినంత మాత్రాన ప్రజల నుంచి మమ్ములను దూరం చేయలేరని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట రాములు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు చలో వరంగల్ కార్యక్రమంలో భాగంగా పర్ధీపూర్, ముచ్చింతల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించగాసోమవారం నాయకులు కె.కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మోహన్‌గౌడ్, రఘువర్ధన్‌గౌడ్, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, నాయకుడు అజయ్‌కుమార్‌రెడ్డితో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లిస్తారని, చిల్లర రాజకీయాలు చేయటం సరైందికాదని హితవు పలికారు. దోషులను గుర్తించి, శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు వట్టెం రాము, కురుమూర్తి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.